సాక్షి చిత్తూరు

మంగళవారం । 10 । డిసెంబర్ । 2024



ఇంటిపై ఒంటరి ఏనుగు దాడి

పొలంలో నివాసం ఉంటున్న ఓ రైతు ఇంటిపై ఏనుగు దాడి చేసి గోడ కూల్చిన ఘటన గంగవరంలో చోటు చేసుకుంది.

- 8లో



సమస్యలు విన్నవించాం..

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లా నలు మూలల నుంచి ప్రజలు విచ్చేసి అధికారులకు సమస్యలు విన్నవించారు.

- 8లో



ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

ప్రజల నుంచి అందే ఫిర్యాదులను పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు సూచించారు.

- 8లో

న్యూస్‌రీల్

శుభారాం డిగ్రీ కళాశాలలో నాక్‌బృందం అధ్యయనం



పుంగనూరు డిగ్రీ కళాశాలలో నాక్‌బృందం సభ్యులు డాక్టర్ శివాజీమిట్టల్

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఢిల్లీకి చెందిన నాక్ బృంద సభ్యులు పర్యటించి, పలు అంశాలపై అధ్యయనం చేశారు. నాక్ సభ్యులు డాక్టర్ శివాజీమిట్టల్, డాక్టర్ ఆషిమాషాహు, డాక్టర్ మహమ్మద్‌అలీకి ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్, అధ్యాపకులు, పూర్వపు విద్యార్థులు కలసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాక్‌బృందం విద్యార్థులతో ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, వైఆర్‌సీ, పీఆర్‌సీ, జేకేసీతో పాటు సపోర్టింగ్ యూనిట్లను పరిశీలించారు. అభివృద్ధి కార్యక్రమాలపై విద్యార్థులు, తల్లిదండ్రులతో చర్చించారు. వీటిపై సమగ్ర నివేదికలను కేంద్రానికి పంపుతామని నాక్‌బృందం తెలిపింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, కోఆర్డినేటర్ అనిల్‌కుమార్, సోమరాజు, ఆంజనేయరెడ్డి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

శిక్షణా తరగతులకు ఇది సమయం కాదు



టీచర్ల సమస్యలపై చర్చిస్తున్న ఎస్టీయూ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి

పెద్దపంజాణి: ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ రీడర్‌షిప్ శిక్షణా తరగతులను తక్షణం రద్దు చేయాలని ఎస్టీయూ చిత్తూరు జిల్లా శాఖ అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యల సేకరణ, ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో వేసవి సెలవుల్లో శిక్షణా తరగతులను నిర్వహించాలని సూచించారు. ఈ నెల 11 నుంచి 19వ తేదీ వరకు ఎస్‌ఏ-1 పరీక్షలు జరపాలని, ఇటువంటి సమయంలో శిక్షణా తరగతులు నిర్వహించడం భావ్యం కాదన్నారు. చాలా స్కూళ్లలో ఒకరిద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, ఒక ఉపాధ్యాయుడు శిక్షణకు వెళ్తే మరొకరు పరీక్షలు ఎలా నిర్వహించాలన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి మోహన్ యాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సరెండర్ లీవుల బకాయిలు, పెండింగ్‌లోని పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్‌ఐ రుణాల ఫైనల్ పేమెంటును వెంటనే విడుదల చేయాలన్నారు. అదేవిధంగా 12వ పీఆర్‌సీకి సంబంధించి వెంటనే కమిషనర్‌ను నియమించాలని, మధ్యంతర భృతి (ఐఆర్) 30 శాతం ప్రకటించాలని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండు చేశారు. ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కమిటీ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారిన పాలసముద్రం మండలం వెంగళరాజుకుప్పం రోడ్డు

ఆర్భాటం సరే.. గుంతలు పూడ్చరే?

అధికారంలోకి వచ్చిన కొత్తలో జనాన్ని నమ్మించడానికో.. లేదా తనదైన మార్కు రాజకీయం చేయాలనో కానీ కూటమి సర్కారు సీఎం చంద్రబాబు గుంతలు లేని రోడ్లపై జనం వెళ్లేలా చేస్తామని పెద్ద పెద్ద భీరాలు పలికారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా రోడ్లలో ఏర్పడిన గుంతలకు మరమ్మతులు పేరిట జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో కూటమి ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించారు. జనం హమ్మయ్యా అనుకునేలోపే చేతులెత్తేశారు. దీంతో కూటమి ప్రభుత్వం పబ్లిసిటీ స్టంట్ కోసం ప్రజలను మరోమారు మోసం చేసేందుకు రోడ్ల మరమ్మతుల కార్యక్రమాన్ని నిర్వహించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో గుంతలు పూడ్చే కార్యక్రమం పురోగతిపై సాక్షి ప్రత్యేక కథనం..



యాదమరి మండలంలో మరమ్మతులకు నోచుకోని రోడ్డు

గుంతలు లేని రోడ్లను నిర్మిస్తామన్న హామీ కూడా గాలికొదిలేసిన పాలకులు

- ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో తట్టాబుట్ట చేతబట్టి గుంతలను పూడ్చే కార్యక్రమం అంటూ నేతల హంగామా
- జిల్లావ్యాప్తంగా 1710 కి.మీ మరమ్మతులకు అనుమతులు
- గత ఆరు నెలల్లో పూర్తయింది కేవలం 41 కి.మీ. మేర మాత్రమే
- అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లు కావొస్తున్నా కనిపించని పురోగతి
- ప్రజలు నిలదీస్తారేమో అని మొహం చాటేస్తున్న కూటమి ప్రజాప్రతినిధులు
- ఎన్నికలకు ముందు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకుల ప్రచార ఆర్భాటం
- మరోమారు కూటమి ప్రభుత్వం మోసం

చిత్తూరు కలెక్టరేట్ : 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తక్షణమే రోడ్ల మరమ్మతులు చేయిస్తాం. ప్రజలు గుంతలు లేని రోడ్లను చూస్తారు. గుంతలు లేని రోడ్లపై ప్రయాణిస్తారు' అంటూ ఎన్నికల ముందు పెద్ద గొప్పలు పలికారు కూటమి ప్రభుత్వం నేతలు. ఆ గొప్పలు పలికిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులను ప్రజలు రోడ్ల మరమ్మతుల అంశాన్ని అడుగుతుంటే మొహం చాటేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గతంలో రోడ్లపైకి తట్టలు తీసుకొచ్చి గుంతలు పూడుస్తున్నామంటూ నానా హంగామా చేశారు. ఇప్పుడు ఆ నేతలంతా కానరావడం లేదు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోనే కాదు.. మున్సిపాలిటీల్లోనూ అధ్వాన రోడ్లపై ప్రజలు తీర అవస్థలు ఎదుర్కొంటూ ప్రయాణం చేస్తున్నా పట్టించుకునే కూటమి ప్రజాప్రతినిధే కరువయ్యారు. ఆరు నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో మంజూరైన పనులు పూర్తి కాకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే హామీలు ఎంతవరకు అమలవుతాయనేందుకు నిదర్శనం.



యాదమరి మండలంలో మరమ్మతులకు నోచుకోని రోడ్డు

జిల్లాలో రోడ్ల మరమ్మతుల పురోగతి ఇలా....

నియోజకవర్గం	మరమ్మతులకు అనుమతులు ఇచ్చిన కి.మీ	ఇప్పటి వరకు పూర్తి చేసిన కి.మీ
చిత్తూరు	117.00 కి.మీ	07 కి.మీ
పలమనేరు	224.00 కి.మీ	06 కి.మీ
పుంగనూరు	107.00 కి.మీ	08 కి.మీ
కుప్పం	547.00 కి.మీ	10 కి.మీ
పూతలపట్టు	267.00 కి.మీ	02 కి.మీ
గంగాధరనెల్లూరు	301.00 కి.మీ	06 కి.మీ
నగరి	147.00 కి.మీ	02 కి.మీ
మొత్తం	1710.00 కి.మీ	41 కి.మీ

అధికారంలోకి వచ్చి ఆరునెలలు గడుస్తున్నా..

జిల్లావ్యాప్తంగా మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,710 కిలోమీటర్ల రోడ్లలో మరమ్మతులు చేయాలని నిర్ణయించారు. దీనికోసం రూ.2193.85 లక్షలు అంచనాతో ప్రణాళిక రూపొందించారు. కానీ చంద్రబాబు ప్రభుత్వం వచ్చి 6 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకూ 50 కిలోమీటర్లు కూడా రోడ్ల మరమ్మతులు చేయలేకపోయారు. పది ఊళ్లలో రోడ్లలో గుంతలు పూడ్చలేదు. కేవలం రూ.60 లక్షలు మాత్రమే వ్యయం చేశారు. అందులోనూ పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లోనే ఖర్చు పెట్టారు. మిగిలిన చోట్ల తూతూమంత్రంగా నిధులను ఖర్చు చేశారు. ఇప్పటి వరకు అడుగు గుంత కూడా పూడ్చకపోవడాన్ని క్షేత్రస్థాయిలో గమనించవచ్చు.

జిల్లా కేంద్రంలో పరిస్థితి మరింత దారుణం

సుమారు 6 లక్షల మందికి పైగా జనాభా ఉన్న చిత్తూరు నగరంలో రోడ్లు మరీ దారుణంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరిట కాలనీల్లో ఉన్న సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కరించేవారు. కొత్త రోడ్లు వేశారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుంచి కలెక్టర్ బంగ్లావరకు ఉన్న రోడ్డులో గుంతలు పూడ్చి మరమ్మతులు చేపట్టారు. ఆ తర్వాత సంతపేట, హైరోడ్డు, గిరింపేట, కట్టమంచి రోడ్లను మరమ్మతులు చేయడమే మరిచిపోయారు. కొత్తబస్టాండు నుంచి గాంధీబొమ్మ వద్దకు వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. పైగా గుంతలు ఎక్కువగా ఉండడంతో నగర ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజలు మండిపడుతున్నారు. గుంతలు లేని రోడ్లంటూ ఇంకెన్ని రోజులు మోసం చేస్తారని విమర్శలు గుప్పిస్తున్నారు.

రోడ్లు దారుణంగా ఉన్నాయ్..



జిల్లాలో ప్రధాన రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరింత అధ్వాన స్థితికి చేరాయి. రోడ్లను బాగు చేయిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పింది. అయితే క్షేత్రస్థాయిలో అలాంటి పరిస్థితులేమి కనిపించడం లేదు. పాలసముద్రంలోని వెంగళరాజకుప్పానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. కూటమిప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రోడ్ల మరమ్మతులు వెంటనే పూర్తి చేసి చూపించాలి.

– కృష్ణయ్య, ఆటో డ్రైవర్, పాలసముద్రం మండలం

గుడిపాల రోడ్డులో అంతే సంగతి..



చిత్తూరు నుంచి గుడిపాల మండలం మీదుగా వేలూరుకు నిత్యం ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. ఆ రోడ్డులో వెళ్లాలంటే భయంగా ఉంది. చిత్తూరు నగరంలోని పలు వార్డుల్లో ఉన్న రోడ్ల పరిస్థితి కూడా అంతంతమాత్రమే. గత ప్రభుత్వంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటికి వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. ఇప్పుడు రోడ్ల మరమ్మతులు చేస్తామన్న కూటమి ప్రభుత్వం పనులు పూర్తి చేయకుండా అలసత్వం చేస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం రోడ్లలో గుంతలను వెంటనే పూడ్చాలి.

– సుజాత, చిత్తూరు నగరం



ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయమైన గంగవరం మండలం కొంగొళ్లపల్లి రోడ్డు



గుంతలమయమైన గంగవరం హైవే రోడ్డు



జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల రోడ్లలో ఇదే దుస్థితి

పింఛన్ కోతలు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ సంక్షేమ పథకాలతో ఊరించింది. అందులో పండుటాకులకు రూ.4 వేలు అంటూ వల వేసింది. నమ్మి ఓటేసిన వారికి ఇప్పుడు చంద్రబాబు సర్కారు పొట్ట కొట్టేందుకు సిద్ధమైంది. పింఛన్ల ఏరివేతకు పచ్చజెండా ఊపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రతి నెలా గుట్టుచప్పుడు కాకుండా పింఛన్లను తొలగిస్తూ రాగా.. తాజాగా బహిరంగంగానే పింఛన్ల ఏరివేతకు దిగింది. అందులో భాగంగా మండలంలోని ముత్తుకూరు సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని ప్రత్యేక బృందం పరిశీలన చేపట్టింది.

- జిల్లా వ్యాప్తంగా పింఛన్ల పరిశీలనకు రంగం సిద్ధం
- మొదటి దశలో పైలెట్ ప్రాజెక్టుగా చిత్తూరు మండలం ముత్తుకూరు సచివాలయం
- 22 మంది అధికారులు.. 11 బృందాలతో సర్వే
- ఒక టీంలో ఇద్దరు చొప్పున అధికారులు
- వితంతు, ఒంటరి మహిళల విషయంలో సంక్లిష్టమైన ప్రశ్నలు
- అయోమయంలో లబ్ధిదారులు



ముత్తుకూరు గ్రామంలో పింఛన్ల పరిశీలన చేపడుతున్న బృందం

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఇప్పటికే ఇచ్చిన హామీలను అమలు చేయలేక మొహం చాటేస్తున్న కూటమి ప్రభుత్వం తాజాగా పండుటాకుల పింఛన్లను తొలగించేందుకు సిద్ధమైంది. పింఛన్ల పరిశీలనకు చిత్తూరు మండలంలోని ముత్తుకూరు సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేసింది. సోమవారం సచివాలయ పరిధిలో 434 మంది పింఛన్ల పరిశీలనకు అధికారులు బృందంగా ఏర్పడ్డారు. మొత్తం 22 మంది రాగా 11 బృందాలుగా ఏర్పడి పింఛన్లను జల్లెడ పట్టారు. ప్రతి పింఛన్‌ను పరిశీలించి మొబైల్ యాప్‌లోని ప్రశ్నలకు జవాబులు అప్‌లోడ్ చేశారు. సాయంత్రానికి పరిశీలన ప్రక్రియను పూర్తి చేశారు. బయటి ప్రాంతంలో ఉన్న లబ్ధిదారుల పరిశీలన మాత్రమే పెండింగ్‌లో పడింది.

పరిశీలనలో..

పింఛన్ల పరిశీలనలో తోతుగా విచారణ చేశారు. పైఅంశాల ఆధారంగా పలువురికి పింఛన్లు ఉంటాయా ? ఉండవా? అనే విషయాలు ప్రశ్నార్థకంగా మారాయి. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం కొన్ని పింఛన్లకు కోతలు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వికలాంగ పింఛన్ల లబ్ధిదారుల విషయంలో అనుమానం వచ్చి..పునః పరిశీలనలో పెట్టినట్లు తెలుస్తోంది. శారీరకంగా బాగున్నా పింఛన్ మంజూరువుతోందని విషయాన్ని గుర్తించినట్టు సమాచారం. ఇలా మరెన్నో పింఛన్లకు కోతలు పడే అవకాశాలున్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి.

రెండో విడతలో..

పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాకో సచివాలయంలో తనిఖీలు చేపడుతున్న కూటమి ప్రభుత్వం.. రెండవ దశలో మొత్తం పింఛన్ల తనిఖీలు చేపట్టే అవకాశం ఉంది. పైలెట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న తనిఖీల్లో వెలుగు చూసే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. చిత్తూరు మండలంలో మొత్తం 4,500లకు పైగా పింఛన్లు ఉన్నాయి. మండలంలో అనర్హత పేరుతో కనీసం వందల సంఖ్యలో పింఛన్లను ఏరివేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా తీసుకుని పింఛన్లు మంజూరు చేయడంతో పాటు ఏడాదిలో రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పింఛన్ల భారాన్ని తగ్గించుకునేందుకు అనర్హులున్నారని జూన్ నెల నుంచి ప్రచారం చేస్తూ వస్తోంది.

తనిఖీలో పరిశీలించిన అంశాలు..

- తనిఖీల్లో ప్రధానంగా ప్రభుత్వం దివ్యాంగులు, వితుంతు పింఛన్లపై పరిశీలన చేపట్టారు.
- పింఛన్‌దారుల్లో అన్ని కేటగిరీలకు సంబంధించి ఆ కుటుంబంలో ఎవరైనా ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నారా?
- అర్బన్ ప్రాంతాల్లో 1000 చదరపు అడుగుల కంటే ఎక్కువగా ఇంటి నిర్మాణం ఉందా?
- విద్యుత్ వినియోగం మొత్తం 300 యూనిట్ల కంటే ఎక్కువ వినియోగిస్తున్నారా ?
- లబ్ధిదారుడి కుటుంబంలో ఎవరికైనా 4 చక్రాల వాహనం (ట్యాక్సీ, ట్రాక్టరు, ఆటో మినహా) వంటిది ఉందా?
- 3 ఎకరాల కంటే ఎక్కువ మాగాణి, 10 ఎకరాల కంటే ఎక్కువ మెట్ట, రెండు కలిపి 10 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉందా?
- కుటుంబంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి లేదా ప్రభుత్వ రంగ సంస్థ ఉద్యోగి లేదా పెన్షనర్ ఉన్నారా?
- కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారా ?
- ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్నారా..?
- దివ్యాంగులకు సంబంధించి వికలత్వం కలిగి ఉన్నారా ?
- పింఛన్‌దారుడి (రీ అసెస్‌మెంటు)
- వైద్య పరీక్షకు సిఫారసు చేస్తున్నారా.. అనే ప్రశ్నలు ప్రత్యేకంగా ఉన్నాయి.
- వితంతువు, ఒంటరి మహిళలకు సంబంధించి పునర్వివాహం చేసుకున్నారా..? అనే ప్రశ్న ప్రత్యేకంగా ఉంది.
- వివరాలు తనిఖీ చేసిన పింఛన్‌దారుల నుంచి యాప్‌లో ఫేషియల్, బయోమెట్రిక్ తీసుకున్నారు.

అర్జీ రాసినందుకు రూ.150

చౌడేపల్లె: విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల మంజూరు కోసం అర్జీ రాయడానికి రూ.150 తీసుకుంటూ చౌడేపల్లె తహసీల్దార్ కార్యాలయం వద్ద కొందరు దళారులు వసూళ్ల దందా నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ప్రతి విద్యార్థికి బర్త్, ఎంట్రీ రిజిష్టర్‌లో పేరు నమోదు కాకుంటే నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ల కోసం పిల్లల తల్లిదండ్రులు తహసీల్దార్ కార్యాలయం వద్ద పడిగాపులు కాస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న కొందరు వ్యక్తులు జిరాక్స్ సెంటర్ల ద్వారా తెచ్చిన అర్జీలను పూర్తి వివరాలను నింపి ఇవ్వడానికి దొరికినంతా దోచేస్తున్నారు. అందుకు గానూ రూ.150 వసూలు చేస్తున్నారు. తల్లిదండ్రులకు చదువు రాకపోవడంతో పాటు వారి అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు కార్యాలయం వద్ద తిష్టవేసుకున్నారు. దీనిపై తల్లిదండ్రులు మాట్లాడుతూ అపార్ ఐడీ కోసం విద్యార్థుల స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, బర్త్, సర్టిఫికెట్లలో ఒకేలా ఉండాలనే నిబంధనలు పెట్టారని, కూలీపనులు వదిలేసి వచ్చిన తమ నుంచి అర్జీలు, నోటరీ, వివిధ సేవా రుసుం ద్వారా అధిక మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు ఈ తంతు సాగిస్తున్నట్లు తెలిసినా రెవెన్యూ అధికారులు ఏమీ పట్టనట్టు ఉదాసీనంగా వ్యవహరించడం ఏమిటనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్టిఫికెట్లు పొందేందుకు వచ్చే వారి కోసం అధికారులు సిబ్బందిని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

పాడి ఆవు చోరీ



ఆవును తరలించేందుకు వినియోగించిన ఆటో

వి.కోట: పట్టపగలే ఓ రైతుకు చెందిన పాడి ఆవును చోరీ చేసిన సంఘటన మండలంలోని పాముగానిపల్లి పంచాయతీలో వెలుగు చూసింది. రైతు తెలిపిన వివరాల మేరకు.. పాతూరుకు చెందిన రాజగోపాల్ తన పొలంలో పాడి ఆవును చెట్టుకు కట్టేసి ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం వెళ్లి చూడగా ఆవు కనిపించలేదు. బైక్‌పై ఆవును వెతుకుతూ రామకుప్పం వైపు వెళ్లగా ఓ ఆటోలో ఆవును తరలిస్తుండడం గమనించాడు. డ్రైవర్‌ను ప్రశ్నించగా ఓ వ్యక్తి ఆటోబాడుగకు రమ్మంటే వచ్చానని బదులిచ్చాడు. అంతలోనే ఆటోలో ఉన్న మరో వ్యక్తి పరారయ్యాడు. గ్రామస్తులు డ్రైవర్‌ను నిలదీయడంతో చోరీ విషయం బయటపడింది. ఆవును రైతు రాజగోపాల్‌కు అప్పగించి, పోలీసులకు సమాచారం అందించగా నిందితున్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నల్లమందు కొరికి శునకం మృతి



నల్లమందు ఉంట తిని మేడపై ఎగిరిపడి మృతిచెందిన కుక్క

పలమనేరు/గంగవరం: అడవిలో వన్యప్రాణుల వేటకోసం వేటగాళ్లు అమర్చిన నల్లమందు ఉంటను కొరికి ఓ కుక్క మృతి చెందిన ఘటన సోమవారం గంగవరం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. గంగ్రాజుపల్లి సమీపంలోని పత్తికొండ రిజర్వు ఫారెస్ట్‌లో వేటగాళ్లు నల్లమందు ఉండలను పగటిపూట పెట్టి మరుసటి రోజు పొద్దున మృతిచెందిన వన్యప్రాణులను తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఓ ఊరకుక్క అడవిలో మాంసపు వాసన ఉన్న ఓ నల్లమందు ఉండను నోటితో కరుచుకుని వచ్చి పల్లి శంకరప్ప ఇంటి వద్ద దాన్ని కొరికింది. దీంతో అది భారీ శబ్దంతో పేలగా, కుక్క ఆ ఇంటి మేడిపై పడి మృతి చెందింది. అటవీశాఖ అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు అర్బన్: పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని చిత్తూరు ఏఎస్పీ రాజశేఖర్ రాజు ఆదేశించారు. సోమవారం చిత్తూరులో నగరంలోని జిల్లా ఆర్మ్డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఏఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చే సమస్యలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను గుర్తించాలని సూచించారు. పోలీసుశాఖకు సంబంధించి 34 ఫిర్యాదులు అందాయి. అలాగే చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

శీతాకాలం.. సర్పగండం



శీతాకాలం.. చల్లని వాతావరణం.. విష సర్పాలు బయట తిరిగే కాలం.. ప్రస్తుత వాతావరణం పాములకు అనుకూలం.. అందుకే అవి పొదల మాటు నుంచి ఆరు బయటకు వస్తాయి. ఆదమరిస్తే కాటు వేస్తాయి. ఈ గండం నుంచి గట్టెక్కడానికి చిన్న జాగ్రత్తలు తీసుకుంటే శ్రీరామరక్ష అని వైద్యులు చెబుతున్నారు.

- గత మూడేళ్లల్లో 2,550 కేసులు.. 32 మంది మృత్యువాత
- చిన్నపాటి జాగ్రత్తలే శ్రీరామరక్ష
- జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో అందుబాటులో యాంటీ స్నేక్ వీనమ్

చిత్తూరు అర్బన్: ఏటా డిసెంబర్ వచ్చిందంటేనే శీతాకాలం ప్రారంభమైనట్లు భావిస్తుంటాం. కానీ ఇదే శీతాకాలం పాములకు అనుకూలమైన కాలం. పొలం గట్లపైన, పెరట్లో, గడ్డివాముపైన సూర్యకాంతి కోసం పడగ ఎత్తుకుని నిరీక్షిస్తుంటాయి. ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్నా కాటు తప్పదు. జిల్లాలో సగటున ఏటా 750 మంది పాము కాట్లకు గురవుతుంటే.. వీరిలో పది మంది వరకు మరణిస్తున్నారు.

ఆ నాలుగింటితోనే ప్రమాదం..

దేశంలో దాదాపు 550 జాతుల సర్పాలుంటే, ఇందులో ప్రధానంగా 90 రకాల విషసర్పాలున్నాయి. మన జిల్లాలో నిత్యం కనిపించే విష సర్పాలు మాత్రం నాలుగు ప్రమాదకరమని నిపుణులు తేల్చారు. తాచుపాము (నాగుపాము), కట్లపాము, రక్తపింజరి, గుమ్మడిత్తుల పింజరి మనకు నిత్యం కనిపించే విషపూరిత ప్రమాదకరమైన పాములు.

గుర్తించడం ఎలా..?

పాము కాటు వేసిన అనంతరం ఇది విషపూరితమైనదా, కాదా అన్నది తెలుసుకోవాలి. కాటు వేసిన ప్రాంతంలో ఎన్ని గాట్లు ఉన్నాయో పరిశీలించాలి. ఒకటి, రెండు పళ్లతో గాట్లు ఉంటే విషపూరితమైనది. మూడు అంతకంటే ఎక్కువ ఉంటే విషం లేని పాములుగా ప్రాథమిక నిర్ధారణకు రావొచ్చు. పాముకాటు వేసిన ప్రాంతం నుంచి విషం క్రమంగా శరీరంలోని అన్ని భాగాలకు చేరుతుంది. ఇందుకు మూడు గంటల సమయం పడుతుంది. ఆలోపు చికిత్స చేయకపోతే మనిషి మృత్యువాత పడతాడు. ఇక పాము విషం నాలుగు రకాలుగా పనిచేస్తుంది. కార్డియాటాక్సిస్ (గుండెపైన), న్యూరోటాక్సిస్ (నరాలపై), హీమోటాక్సిన్ (రక్తంపై), సైటోటాక్సిన్ (శరీర కణజాలవ్యవస్థ)పై పనిచేస్తుంది. కాటుకు గురైన వ్యక్తి విష ప్రభావానికి లోనైనప్పుడు కళ్ల మూతలు పడడం (ఐ డ్రూపింగ్), మెడ పక్కకు వంగుట (బ్రేకింగ్ నెక్సైన్), గాలి పీల్చలేకపోవడం, గుండె దడ, ఎక్కువగా చెమటలు పట్టడం, బీపీ వంటి లక్షణాలుంటాయి.

ఏం చేయాలి..?

- కాటు వేసిన వెంటనే దగ్గర్లోని ఆస్పత్రికి తరలించాలి. వైద్యులు వెంటనే చికిత్స చేస్తారు. గంట వ్యవధిలో యాంటీ స్నేక్ వీనమ్ ఇంజెక్షన్లు నాలుగు ఇస్తారు. మరీ విషపూరితమైతే ఆరు ఇంజెక్షన్లు ఇస్తారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రులు, సీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో ఈ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. ఇక హోమియోకు సంబంధించిన పాముకాటుకు విరుగుడు మందు నాజ త్రిపుర - 200 అనే మందు సైతం ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో ఉంటుంది.
- పాము కాటు వేసిన ప్రదేశాన్ని సబ్బుతో కడగాలి. క్రేప్ బ్యాండేజ్ చుట్టాలి. ఆ భాగాన్ని ఎక్కువగా కదలనివ్వకూడదు. ప్రధానంగా గుండె ధైర్యం అవసరం. టెన్షన్‌కు గురవ్వకుండా ఉండాలి. దగ్గరలోని ఆస్పత్రికి వెంటనే తీసుకెళ్లాలి. పాము కాటు వేసిన తరువాత ఏమీ తినకూడదు. తాగకూడదు. సినిమాల్లో చూపించేలాగా కాటు భాగాన్ని తాడుతో గట్టిగా కట్టడం, కొరికి, కోసి విషయం తీయడం వంటివి చేయకూడదు.
- రైతులు పొలాలకు వెళ్లే సమయంలో భుజంపై కండువా, కిర్రు (శబ్దం వచ్చే) చెప్పులు ధరించాలి. వీలైతే మోకాలి వరకు కవరు చేసిన బూట్లు ధరించాలి. చేతిలో కర్ర, టార్చిలైటు ఉండాలి. ఎప్పుడైనా పాము ఎదురైతే భుజం మీద కండువాను దానిపై వేయాలి. అది దాన్ని కాటు వేస్తుంది. ఆ విషయం కండువాకు చేరుతుంది.
- ఆరోగ్య భద్రత పథకం కింద పాము కాటుకు గురై మృతి చెందిన వ్యక్తికి కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష అందిస్తుంది.

గత మూడేళ్లలో ప్రమాద వివరాలివీ..

సంవత్సరం	పాముకాటుకు గురైనవారి సంఖ్య	మృతుల సంఖ్య
2021-22	983	21
2022-23	984	19
2023-24 (నవంబర్ వరకు)	680	13
మొత్తం	2647	53

ధైర్యం అవసరం..



"పాము కరిచిన వెంటనే మొదట ధైర్యం తెచ్చుకోవాలి. కంగారు పడకుండా కరిచిన పాము ఎలాంటిదో తెలుసుకునే ప్రయత్నం చేయాలి. అప్పుడే ఆస్పత్రిలో డాక్టర్‌కు చెప్పడం కుదురుతుంది. దానికి తగిన వైద్యం చేయడం సులభం. సినిమాల్లో చూపినట్లు ఇష్ట ప్రకారం తెలిసీ, తెలియని చికిత్స చేస్తే ప్రాణాలకే ప్రమాదం. కాటుకు గురైన వ్యక్తిని సమీపంలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాలి. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో 3,300 వరకు యాంటీ స్నేక్ వీనమ్ (పాము కాటుకు సూది మందు) అందుబాటులో ఉన్నాయి. కొరత అన్నది లేదు.

– డా. ప్రభావతి, జిల్లా ప్రభుత్వ వైద్యశాలల సేవల సమన్వయాధికారి, చిత్తూరు

నకిలీ ధ్రువపత్రాల తయారీదారులపై కేసు

రామకుప్పం: జిల్లాలో సంచలనం సృష్టించిన నకిలీ జనన ధ్రువపత్రాల తయారీదారులపై సోమవారం కేసు నమోదు చేసినట్లు రామకుప్పం ఎస్ఐ వెంకట మోహన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..మండల పరిధిలో ఇంటర్‌నెట్ సెంటర్లు, సీఎస్‌సీ సెంటర్లలో నకిలీ జనన ధ్రువపత్రాలు తయారుచేసి ప్రజలకు అందిస్తున్నారని స్థానిక ఎంపీడీఓ లక్ష్మీకాంత్ కుప్పం ఆర్డీఓ శ్రీనివాసరాజుకు సమాచారం అందించారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ శ్రీనివాసరాజు, కుప్పం రూరల్ సీఐ మల్లేష్ యాదవ్, తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ లక్ష్మీకాంత్ మండలంలోని అన్ని నెట్ సెంటర్లను గురువారం తనిఖీ చేశారు. అందులో భాగంగా మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తి ద్వారా నకిలీ జనన ధ్రువపత్రాలను తయారు చేయడమే గాక పంచాయతీ, మున్సిపాలిటీ అధికారుల డిజిటల్ సంతకాలను దుర్వినియోగం చేసిన మండలానికి చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి ధ్రువపత్రాల కోసం అధిక మొత్తంలో సుమారు రూ.1000 నుంచి 3000 వరకు వసూలు చేసినట్లు తెలిపారు. సోమవారం ఎంపీడీఓ లక్ష్మీకాంత్ ఫిర్యాదు మేరకు వీర్నమలకు చెందిన బాలానాయక్, కోట్లగూరుకు చెందిన నవీన్, ముద్దనపల్లికి చెందిన అక్రమ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నకిలీ పత్రాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

బాలికపై లైంగిక దాడి

కార్వేటినగరం: సినిమాకు వెళదామని చెప్పి తీసుకెళ్లి ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన కార్వేటినగరం మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా.. మండలంలోని ఒక దళితవాడకు చెందిన ఓ యువకుడు అదే గ్రామానికి చెందిన మరో బాలికను ఆదివారం రాత్రి తమిళనాడులోని పళ్లిపట్టులో సినిమాకు వెళదామని చెప్పి ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లాడు. గ్రామ సమీపంలో ఆమెపై బలవంతంగా లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ప్రజలకు అండగా నిలబడదాం



పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కేరోజా

నగరి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రజలకు అండగా నిలబడడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుండాలని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కేరోజా అన్నారు. సోమవారం నగరి పట్టణంలోని తన నివాస కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాలక ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను బురిడీ కొట్టించిందన్నారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు అవుతున్నా పథకాలు ప్రజలకు అందలేదన్నారు. అర్హత ఉన్నా పెన్షన్లు తొలగించేస్తున్నారని ఆరోపించారు. కొత్త పెన్షన్లు మంజూరు చేయడం లేదన్నారు. విద్యుత్ బిల్లులు పెరిగిపోతున్నాయని, నిత్యావసర సరకులు ప్రజలకు అందుబాటులో లేవన్నారు. ఈ అంశాలపై ప్రజల పక్షాన నిలబడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ శ్రేణులు ప్రజల సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపుతూ ప్రజలకు అండగా ఉండాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, జెడ్పీటీసీ సభ్యులు గాంధీ, రాష్ట్ర మొదలియార్ సంఘం మాజీ డైరెక్టర్ బాలకృష్ణన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ తిరుమలరెడ్డి, దేశమ్మ ఆలయ మాజీ చైర్మన్ వేణుబాబు, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, బాబు, మురుగ, భూపాలన్, విజయపురం వైస్ ఎంపీపీ బాలాజీ, వడమాలపేట జెడ్పీటీసీ మాజీ సభ్యులు సురేష్‌రాజు, మునివేలు తదితరులు పాల్గొన్నారు.

టమాట రావడం లేదు

ఉన్నఫళంగా టమాట ధరలు పతనం అవడంతో పంట సాగు చేసిన రైతుల నోట మాట రావడం లేదు. కొత్త ఏడాదిలో బాక్సు రూ.1000 పలుకుతుందని భావించిన వారి ఆశలు ఆవిరయ్యాయి. సోమవారం పలమనేరు 14 కేజీల బాక్స్ కేవలం రూ.150 నుంచి రూ.100 పలకడంతో రైతులు ఉసూరమంటూ వెనుదిరిగారు.

- ధరలు లేక టమాట రైతుల విలవిల
- పలమనేరులో 14 కేజీల బాక్సు రూ.150
- ఉన్నఫళంగా పతనమైన ధరలు
- చత్తీస్‌ఘడ్‌లో మొదలైన సీజన్
- జిల్లాలోని మార్కెట్లకు రాని బయటి వ్యాపారులు



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు డివిజన్‌లో సాగు వివరాలు

రబీలో టమాటా సాధారణ సాగు	5వేల హెక్టార్లు
ప్రస్తుతం సాగైన పంట	4 వేల హెక్టార్లు
ఇప్పుడు కోతదశలో ఉన్న తోటలు	3 వేల హెక్టార్లు

పలమనేరు: వారానికిముందు పలమనేరు మార్కెట్‌లో టమాటా ధర బాక్సు రూ.800 పలికింది. ఈ సీజన్‌లో డిసెంబరు ఆఖరు నుంచి కొత్త సంవత్సరంలో టమాటా ధర రూ.1000 దాటుతుందని వ్యాపారులు, రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. కానీ వీరి ఆశలు అడియాశలయ్యాయి. ఆ మేరకు సోమవారం స్థానిక టమాటా మార్కెట్‌లో ధర బాక్సు (14కిలోలు) రూ.150 నుంచి వందకు పడిపోయింది. దీంతో ఏమి చేయాలిరా దేవుడా అంటూ రైతులు ఆవేదనకు గురయ్యారు. ధరలు ఎప్పుడెలా ఉంటాయో తెలియక టమాట సాగు లాటరీగా మారింది.

వెయ్యి దాటుతుందనుకుంటే..!

బయటి రాష్ట్రాల నుంచి వ్యాపారులు జిల్లాలోని మార్కెట్లకు వస్తుండడం, ఇదే సమయంలో కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో టమాటాకు వైరస్ తెగుళ్లు, చలిమంచు, వర్షాల కారణంగా అక్కడి సరుకులో నాణ్యత తగ్గింది. దీంతో ఇక్కడున్న నాణ్యమైన సరుకుకు ధర పెరిగినట్టు మండీవ్యాపారులు భావించారు. ఇక్కడి సరుకు బయటి రాష్ట్రాల్లోనూ మంచి ధరలు పలకడంతో ధరలు పెరిగాయి. పరిస్థితి ఇలాగే ఉంటే కొత్త సంవత్సరానికి బాక్సు ధర రూ.వెయ్యి దాటుతుందని వ్యాపారులు అంచనా వేశారు.

కొంపముంచిన చత్తీస్‌ఘడ్ సరుకు..

చత్తీస్‌ఘడ్, రాయఘడ్ ప్రాంతంలో ఈనెల రెండోవారం నుంచి టమాటా సీజన్ మొదలైంది. దీంతో నాణ్యమైన సరుకు ఎక్కువగా ఈ రెండునెలల పాటు అందుబాటులోకి రానుంది. దీంతో అక్కడి సరుకు భారీగా ఇక్కడి మార్కెట్లకు చేరుతోంది. ఫలితంగా బయటి రాష్ట్రాల వ్యాపారులు జిల్లాలోని మార్కెట్లకు రావడం లేదు. దీంతో ధరలు అమాంతం తగ్గినట్టు తెలుస్తోంది.

ఆరోగ్య పంచాయతీగా బొమ్మసముద్రం



సర్పంచ్ రఘును సన్మానిస్తున్న జిల్లా అధికారులు

ఐరాల: జాతీయ స్థాయిలో బొమ్మసముద్రం పంచాయతీ ఉత్తమ ఆరోగ్య పంచాయతీ(హెల్దీ పంచాయతీగా) ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా పంచాయతీ అధికారి సుధాకర్‌రావు, డీఎల్‌పీఓ పార్వతి తెలిపారు. సోమవారం బొమ్మసముద్రంలో సర్పంచ్ రఘు ఆధ్వర్యంలో వారు అభినంద సభ నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ జాతీయస్థాయికి బొమ్మసముద్రం హెల్దీ పంచాయతీగా ఎంపికై మిగతా పంచాయతీలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని పెంచితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం సర్పంచ్ రఘు, ఈఓపీఆర్డీ కుసుమకుమారి, పంచాయతీ కార్యదర్శి మౌనిక, చిగరపల్లె పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, పంచాయతీ కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, చిగరపల్లె వైద్యాధికారి స్వాతి సింధూర, ఎంపీటీసీ విజయకుమారి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

తప్పుడు సంతకాలతో అక్రమ మైనింగ్

- మా క్వారీలోకి వెళితే అడ్డుకున్న శేఖర్‌బాబు అనుచరులు
- వారికి చంద్రగిరి ఎమ్మెల్యే సహకారం
- నేను కూడా టీడీపీ వాడినే.. అయినా వదల్లేదు
- నా ప్రాణానికి వారి నుంచి ముప్పు
- గ్రానైట్ వ్యాపారి భానుప్రతాప్



సమావేశంలో మాట్లాడుతున్న భాను ప్రతాప్

చిత్తూరు రూరల్ : తప్పుడు సంతకాలతో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని ఎస్ఆర్ పురం మండలానికి చెందిన టీడీపీ నాయకుడు భానుప్రతాప్ ఆరోపించారు. చిత్తూరు గ్రానైట్ క్వారీ సంఘం నాయకుడు శేఖర్ బాబు నుంచి తన ప్రాణానికి ముప్పు ఉందని ఆయన వాపోయారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఆర్‌పురం మండలం దుర్గరాజాపురంలో 1.980 హెక్టార్ల క్వారీ తనకు మంజూరు అయిందన్నారు. మైనింగ్ కార్యాలయంలో ఆఫీస్ పనులు చేసేందుకు శేఖర్ బాబుకు తాను ఇచ్చిన జీపీఏని ఫోర్జరీ చేసి అక్రమంగా మైనింగ్ చేశారని తెలిపారు. ఎటువంటి అనుమతి లేకుండా దాదాపు 1000 బ్లాక్‌ల రాయిని మైనింగ్ చేసి ఎగుమతి చేశారని ఆరోపించారు. అంతేకాకుండా పక్కనే ఉన్న మరొక క్వారీలో అనుమతి లేకుండా 70 సెంట్లలో దోచేశారన్నారు. రెండు వారాల క్రితం క్వారీలో పనిచేయడానికి వెళ్లిన తనను శేఖర్ బాబు అనుచరులు అడ్డుకున్నారని వాపోయారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా తనకు న్యాయం జరగలేదన్నారు. శేఖర్ బాబుకు చంద్రగిరి ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయని, తాను కూడా టీడీపీకి చెందిన వాడినే అయినా తనకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ప్రస్తుతం క్వారీలో ఉన్న వాహనాలను, యంత్రాలను తొలగించి తనకు క్వారీని అప్పగించి, తాను మైనింగ్ చేసుకునేందుకు భద్రత కల్పించాలని విన్నవించారు.

భానుప్రతాప్‌వి తప్పుడు ఆరోపణలు

దుర్గరాజాపురం క్వారీ వ్యవహారంలో తనపై భాను ప్రతాప్ అనే వ్యక్తి చేసిన ఆరోపణలు నిరాధారం అని గ్రానైట్ వ్యాపారి శేఖర్ బాబు స్పష్టం చేశారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

సమస్యలు విన్నవించాం..చూపగలరు పరిష్కారం

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీలు 241
- వినతులు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : అయ్యా.. తమ సమస్యలు పరిష్కరించాలంటూ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్ఓ మోహన్ కుమార్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి 241 అర్జీలు నమోదైనట్లు ఏఓ కులశేఖర్ వెల్లడించారు.

5 నెలలుగా జీతం లేదు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆయాలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు ప్రభుత్వం ఐదు నెలలుగా జీతాలు ఇవ్వలేదంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆయమ్మల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జయకుమారి మాట్లాడుతూ చిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం జీతాలు ఇవ్వకుండా కక్ష సాధించడం అన్యాయమన్నారు. ఐదు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ప్రశ్నించిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయాల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జేసీ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ భూములు మంజూరు చేయాలి

వ్యవసాయ భూములను మంజూరు చేయాలని గుడిపాల మండలం గట్రాలమిట్ట యానాది కాలనీకి చెందిన యానాదులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ గ్రామంలో 40 కుటుంబాలు ఉన్నట్లు తెలిపారు. ఎవరికీ వ్యవసాయ భూములు లేవన్నారు. రోజు కూలీకి వెళ్తే కానీ పూట గడవదన్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయ భూములను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మేగల, సెల్వరాణి, సరస, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ భూములు మంజూరు చేయాలని కోరుతున్న యానాదులు

కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయండి..



కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలంటూ విన్నవిస్తున్న సొసైటీ నాయకులు

ఎంతో ఘన చరిత్ర కలిగిన చిత్తూరుకు కేంద్రీయ విద్యాలయం మంజూరు చేయాలని చిత్తూరు స్మార్ట్ సిటీ అండ్ డెవలప్‌మెంట్ సొసైటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సొసైటీ నాయకులు తాండవమూర్తి, సత్య, గోపినాయక్ మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర కలిగిన చిత్తూరు జిల్లాకు కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. చిత్తూరు ప్రజలకు నాణ్యమైన విద్యనందించాల్సిన ప్రభుత్వాలు చిన్నచూపు చూడడం దారుణమన్నారు. నాణ్యమైన విద్య అందాలంటే చిత్తూరు ప్రజలకు కేంద్రీయ విద్యాలయం అవసరమన్నారు. కలెక్టర్ స్పందిస్తూ చిత్తూరు నగరం, కుప్పానికి త్వరలో కేంద్రీయ విద్యాలయం అనుమతులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ నాయకులు శరత్‌చంద్ర, శివకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటిపై ఒంటరి ఏనుగు దాడి

- ప్రాణభయంతో పరుగులు తీసిన నివాసితులు



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధిత దంపతులు

గంగవరం: వ్యవసాయ పొలం వద్ద నివాసం ఉంటున్న రైతు ఇంటిపై ఒంటరి ఏనుగు విజృంభించింది. ఈ సంఘటన మండలంలో సోమవారం వేకువజామున జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కీలపట్ల పంచాయతీ బండమీదజరావారిపల్లికి చెందిన రెడ్డెప్ప తన కుటుంబంతో కలిసి దాదాపు పొలంలో ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. సోమవారం తెల్లవారుజామున ఇంటిలో నిద్రిస్తుండగా ఒంటరి ఏనుగు నుంచి ఇంటిపై దాడికి దిగింది. ఇంటి పైకప్పు పెకలిస్తున్న శబ్దాన్ని పసిగట్టిన రెడ్డెప్ప, కుటుంబీకులు ప్రాణాలు అరచేత పట్టుకుని పరుగులు తీశారు. కొద్దిసేపటికి వచ్చి చూడగా ఇంటి ముందున్న గోడను ధ్వంసం చేసి ఇంటిలోని రాగులు, బియ్యం బస్తాలను ఏనుగు నోట కరుచుకుని వెళ్లిపోయింది. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ సుకుమార్, అటవీ సిబ్బంది బాధిత రైతు ఇంటిని పరిశీలించారు. నష్టపరిహారం కోసం పంచనామాను జిల్లా అధికారులకు పంపినట్టు సెక్షన్ ఆఫీసర్ తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఏనుగుల అడ్డుకట్టకు వేయాలని, అలాగే పరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు.